# రెండో ప్రాణం

**బాహ్య సౌందర్యానికి బందీ అయిన మగవాడే ఆత్మ సౌందర్యాన్ని ఆరాధించగలడు. నిష్కల్మష హృదయాన్ని నిండుగా అర్థంచేసుకోగలడు. తన మనసుకు అంగీకారం కాకపోయినా, మరొకరి తృప్తికోసం మమతలను పంచిపెట్టనూగలడు. పురుషుని హృదయం తనని ఆరాధించే వనితలను ఎందరినైనా తనలో ఇముడ్చుకోగలదు. కానీ స్త్రీ తన హృదయంలో ఒక్కరికే చిరస్థానం కల్పిస్తుంది.**

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

---

కలకత్తాలాంటి మహానగరంలో తెలిసిన వాళ్లని కలుసుకోవడమే పెద్దకష్టం. ఎవరి పనిలో వారుంటారు — ఎక్కడ పనిచేస్తున్నా, సాయంత్రం బాగా ఆలస్యం అయితేగాని ఇళ్లకి రారు. చిన్న చిన్న ఉద్యోగులైతే ట్రాముల్లో, బస్సుల్లో కాలుపెట్టే ధైర్యం కూడగట్టుకునేందుకే గంటన్నర పట్టిపోతుంది. ఆ తరవాత మార్గ మధ్యంలో ట్రాఫిక్ జాములూ, ఇంజన్ ఫెయిల్యూర్లూ, ప్రొసెషన్లూ లేకుండా నెమ్మది నెమ్మదిగా, అంగవైకల్యం కలగకుండా, బట్టలు చిరగకుండా ఇంటికి చేరేసరికి ఒక యజ్ఞం. పెద్ద ఉద్యోగులెలాగా గంట, రెండు గంటలు ఆఫీసులో పనిచేస్తే తప్ప టేబిల్ ఖాళీ అవదు, ఆ నిత్య యజ్ఞంలో.

ఇన్ని లక్షల ప్రజల్లో నేను రమేశ్వర్‌ని కలుసుకోడం, ఎంతో లాంఛనంగా, హఠాత్తుగా కలిగిన మా చిన్న పరిచయం స్నేహందాకా అభివృద్ధి పొందడం నాకే చాలాసార్లు ఆశ్చర్యం వేయించింది.

అయిదారు నెలల క్రిందట, ఒక ఆదివారం మెట్రో ఆర్కేడ్‌లో నిలబడ్డాను. వందలకొద్దీ శరీరాలు టిక్కెట్ల క్యూల్లోనో, టాక్సీలకోసం ఆ పరిసరాల్లో తిరుగుతూను అక్కడ ఖాళీ ఏమీ లేకుండా చేసేరు. మధ్య మధ్య లోపలినించి ఎయిర్‌కండిషనర్స్ చల్లబరిచిన చక్కటి గాలి నేను నిలుచున్న వైపు వస్తూంది.

కాని, వాకీ తొక్కిడివల్ల బాధకాని, చల్లగాలి సుఖం కాని తెలియడంలేదు. జ్యోతి నన్నక్కడ కలుసుకుంటానని చెప్పింది. ఆరుకి పది నిమిషాల ముందే వచ్చి నిలబడ్డాను. ఆరు దాటి పదినిమిషాలైనా, ఆమె జాడ లేదు.

ఆమెమీద నాకు చాలాసార్లు కోపం వచ్చింది. కాని ఆ రోజు మరీ ఎక్కువగా వచ్చింది. బయట బరువైన నల్లటి మేఘాలు ముసురుకుంటున్నాయి, నా కోపానికి రంగులువేసి రూపం ఇచ్చినట్లు. చల్లగాలి తగలగానే అవి వర్షించి తేలికపడతాయి. . . జ్యోతి రాగానే నేనూ నా ఉద్రేకం ఆమెకి చెప్పి, తేలికపడతా ననుకున్నాను.

ఆమె చాలా అందంగా ఉండవచ్చును.

ఆమె చాలా తియ్యగా మాట్లాడవచ్చును.

ఆమె కళ్లు ఎంతో ఎంతో పెద్దవి కావచ్చును.

కాని, ఆమెలో మాట నిలుపుకునే సుగుణం లేదు. సాయంత్రం పిలిస్తే, నేను సరీగా టైముకి వెళ్లి ఆమెకోసం అరగంటా, నలభై నిమిషాలూ ఎదురు చూసిన రోజులున్నాయి.

ఒకసారి ఇరవై అయిదు నిమిషాలు చూసి, విసుగుతో వాలుగంతప్పులా దిగి వెళ్లిపోయాను. ఎందుకో ఆ రోజు ఇంటికి పిలిచింది జ్యోతి. అవును. ఆమె ఎస్. ఎ. రిజల్ట్సు తెలిసేక నాకు పార్టీ ఇవ్వడానికి... నేను చేసిన సహాయానికి కృతజ్ఞతకి!

టాక్సీలో నేను నా ఫ్లాట్‌కి తిరిగి వచ్చి, ఏం చెయ్యటం అని ఆలోచిస్తుంటే నా టెలిఫోన్ పిలిచింది.

జ్యోతి.

నా కోపం ఇలాగే మరీ ఉద్ధృతం అయిపోయింది.

"హల్లో" అన్నాను పొడిగా.

"మీకోసం వచ్చి చూసేసరికి లేరు!" అంది ఆశ్చర్యంగా.

"అవును — విసిగి, వచ్చేశాను" అన్నాను.

"కోపంతోనా?"

ఎంత తియ్యటి కంఠస్వరం ఆమెది!

"అవును" అన్నాను కొంచెం సందేహంగా.

"పప్పెంటు అలాగే చెప్పేడు" అంది జ్యోతి.

నేనేం అనలేదు. ఈ అమ్మాయి మరీ నన్ను లోబరుచుకుంటూందన్న కోపం ఇంకో వేపు ప్రజ్వరిల్లుతూంది.

"దయచేసి వెంటనే రండి."

"సారీ!"

"మీకోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిలబడతాను."

"ఆ శ్రమ వద్దు."

"ఏం చేస్తున్నారు?"

"పడుకున్నాను."

"నేను రానా?"

"వద్దు — గుడ్‌నైట్!" అని ఫోను పెట్టేశాను.

నాలో శివశ్రీ లేదని కాదు. కాని, దానికి చాలా స్పష్టమైన అవధులున్నాయి. జ్యోతి కావచ్చును — మరెవరైనా కావచ్చును. కనీసం మర్యాదలు పాటించకపోతే సహించే తత్త్వం కాదు నాది. అదికాక, ఆమె నాకు స్నేహితురాలుగా తప్ప, మరే భావనా నాలో లేదని చాలాసార్లు స్పష్టంచేశాను.

ఆ తరవాత పదిహేను నిమిషాల్లో జ్యోతి నా ఇంటికి వచ్చి క్షమాపణ చెప్పి, నన్ను మళ్లీ తీసుకు వెళ్లింది — అది వేరే మాట. ఆ రోజు మెట్రోలో ఎదురుచూడ్డం మా స్నేహానికే అవరోధం తెచ్చేట్టుంది.

ఆరుంపావు దాకా చూసి, లోపలికి వడవబోతూంటే నా దగ్గిర రెండు టిక్కెట్లున్నమాట జ్ఞాపకం వచ్చింది. అప్పటికి కొద్ది నిమిషాల కిందటే బుకింగ్ ఆపేశారు, 'హౌస్‌ఫుల్' బోర్డు చూపి.

ఇద్దరు, ముగ్గురు చేతిలో అయిదు రూపాయల నోట్లతో నా వైపు వచ్చారు. నాలుగడుగుల అవతల నిలబడి నా వైపు చూస్తున్న అతన్ని చూసి, "సారీ!" అని వాళ్లని పంపి అతన్ని సమీపించి, "మీకు టికెట్ కావాలా?" అన్నాను.

"అవును" అన్నాడు కృతజ్ఞతతో.

"రండి" అన్నాను.

మీదికి వెళ్లిపోయాం. సినిమా ముందు నలభై నిమిషాలు అవీ ఇవీ స్లైడ్ రీల్స్ అయ్యాక, సిగరెట్లు కాల్చుకునేందుకు ఇద్దరం బయటికి వచ్చాం.

నాకు సిగరెట్ ఆఫర్‌చేసి, తనూ వెలిగించుకుని, "డ్రింక్ తీసుకుంటారా?" అన్నాడు ఆశగా నమ్మకల్ని కనిపెడుతూన్న బేరర్‌ని చూసి.

"కోక్ — అయితే" అన్నాను.

అతను రెండు కోక్స్‌కి చెప్పి, "బయట పెంచి వర్షం పడుతూంది" అన్నాడు.

"మీ కెలాగ తెలుసును?" అన్నాను. బాల్కనీ మీంచి బయట కనిపించదు.

"ఇంతకా మెట్లెక్కి వస్తూన్న ఒక అమ్మాయి చీర అంతా బాగా తడిసింది."

"మీ అబ్జర్వేషన్—"

"ఎలిమెంటరీ, మై డియర్ వాట్‌సన్!" అని నవ్వుతూ, నా పేరు తెలుసుకుని, తనపేరు చెప్పేడు.

కోక్ తాగడం ముగించి, సిగరెట్స్‌పారేసి, లోపలికి వెళ్లాం. సినిమా ముగిసి బయటికి వచ్చేసరికి ఇంకా జల్లు పడుతూనే ఉంది. కనుచూపుమేరలో టాక్సీ లేదు.

నా పరిస్థితి గమనించి, "మీ రెక్కడికి వెళ్లాలి?" అన్నాడు రమేశ్వర్.

"అలీపూర్."

"పదండి, నేను డ్రాప్‌చేస్తాను."

లాంఛనానికైనా వద్దనే పరిస్థితులు కావవి. అలాటి సమయాల్లో ఈ మహానగరంలో కదలిక కన్న కష్టం లేదు.

కారు కొంచెం దూరం వెళ్లేక, "ఒక అమ్మాయి నన్నీ పరిస్థితిలో పెట్టింది — ఈ పిక్చర్ ఎలాగైనా చూడాలనుకుంటే చివరి నిమిషందాకా రానిచ్చింది కాదు. మీరు టైముకి చాలా సహాయం చేశారు" అన్నాడు రమేశ్వర్.

"మరో అమ్మాయి నన్నూ చిరాకు పెట్టింది, వస్తానని రాడం మానేసి. ఇద్దరూ కలిసి మంచిపనే చేశారు!" అన్నాను.

నవ్వుకున్నాం. వీథిదీపాలు ఆరిపోయాయి — వర్షానికి. చీకట్లో విశాలమైన రోడ్లైనా, జాగ్రత్తగా పోయి ఇరవై నిమిషాలకి నన్ను దించేశాడు నా ఇంటి దగ్గిర.

"మీ రెక్కడ ఉండడం?" అన్నాను ధన్యవాదాలు చెప్పి, దిగుతూ.

"సి. ఐ. టి. రోడ్‌లో" అని చెయ్యి ఊపి అతను వెళ్ళిపోయాడు. 'భగవాన్! ఈ కొంపనించి ఆ కొంపకి మళ్ళీ పోవాలి వానప్పుడు!' అని జాలిపడడమూ, అతని పేరు తప్ప ఇంకే వివరాలూ తెలుసుకోనందుకు విచారించడమూ చేశాను భోజనంచేసి నిద్రపోయేదాకా.


అతనంటే ఎంతో అభిమానం నాకు కలిగింది — కాని, ఈ చిన్న పరిచయం ఇంతటితోనే అంతం అయినందుకు చాలా విచారించేను.

సాయంత్రంనించీ జ్యోతి టెలిఫోన్ చెయ్యలేదని సర్వెంటు చెప్పడం నాకు ఆమె మీద మరికొంచెం కోపం కలగజేసింది. కాని, రమేశ్వర్ స్నేహం ఆమె స్నేహంకన్నా ఉత్తమమైన అదృష్టం అని సరిపెట్టుకున్నాను.

తరవాత పది రోజులు జ్యోతికీ నాకూ మధ్య మాటలు కూడా లేకుండా వెళ్ళిపోయాయి. ఆ తరవాత ఒక సెలవు రోజున హఠాత్తుగా ఆమె వచ్చి, నిద్ర పోతూన్న నన్ను లేపి, "పగలు నిద్ర ఏమిటి మీకు, పాడు అలవాటు?" అంటూ మేలుకొలుపు పాడింది.

త్వరగా లేచి ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని వచ్చేసరికి జ్యోతి వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని నాకోసం ఎదురుచూస్తూంది.

"చిరకాల దర్శనం!" అన్నాను పూర్తిగా తేరని నిద్రలో లాగ.



అనన్య సామాన్య ప్రచారంగల
తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

ఉచిత బహుమతి
అన్ని స్థైలు సుందర వనితలు కోరుకొను సరి కొత్త ఆకర్షణీయమైన డిజైన్లలో అంద మైన రంగులతో మంచి ఫాషన్ల కాశ్మీరు, బెంగుళూరు ఆర్టుసిల్కు చీరెలు మా వద్ద మాత్రమే మిక్కిలి తక్కువ ధరకు లభిస్తున్నవి. స్పెషల్ ఆఫర్ చీర ఒకటి వెల రు. 13/50 లు. రెండు రు. 26/- లు, మూడు రు. 37/50.లు. నాలుగు రు. 47/, రెండు లేక ఎక్కువ చీరెలతో ఒక బ్లౌజు ముక్క ఉచితం వి. పి. పార్సెలు ద్వారా సరాసరి ఇంటికి తెపించు కొనండి. అత్య ధికమైన గిరాకి, నేడే ఆర్డరు ఇవ్వండి

KOHINOOR SAREE AGENCY
(R) KALYAN PURA, DELHI-6.

"ఆ మాటే నేనూ అందామని వచ్చాను" అంది జ్యోతి కొంచెం కోపం చూపుతూ.

"టెలిఫోన్ చేస్తే సరిపోయేదిగా!"

"ఏం? నేను చూడకూడని విషయాలేమైనా ఉన్నాయా?"

"చూడండి — అన్ని గదులూ తెరిచే ఉన్నాయి. అప్పుడు మీకే తెలుస్తుంది."

నిశ్శబ్దంగా కూర్చుంది జ్యోతి. ప్రథమాయుధం వ్యర్థమైపోయి, తరవాతి కార్యక్రమం గురించి ఆలోచిస్తూందా?

సిగరెట్ వెలిగించుకుని నేనూ నిశ్శబ్దంగానే కూర్చున్నాను. ఈమె చిన్నపిల్లల్లాంటిది. దగ్గరగా ఉంటే తలబాధ. దూరం అయిపోతే హృదయవేదన.

"నాతో మాట్లాడాలని కూడా లేకపోతే నేను వెడతాను."

ఇది — దుఃఖానికి దగ్గరగా ఉన్న ఆ కంఠస్వరంలో ఈ మాటలు — రెండో ఆయుధం.

"పిలిస్తే రాలేదు, వెళ్ళేందుకు ఎవరు అడ్డగలరు?" అన్నాను—కొంచెం గుండె గట్టిపరుచుకుని.

ఆమె లేచింది — చివాలునకాదు — నీరసంగా, నెమ్మదిగా. కోపం, దైన్యం మిళితమైన తడిచూపు బాణాన్ని నామీద ప్రయోగించి రెండడుగులు వేసి, "మీరు క్షమిస్తారని అనుకున్నాను. డైమండ్ హార్బరుకి వెడదామని ప్లాన్ వేశాను" అంది.

ఇది మూడో ఆయుధం.

"మరేం కంపెనీ దొరకలేదా?" అన్నాను.

ఈసారి ఆమెకి నిజంగా కోపం వచ్చింది. "క్షమించడ మనేది మీకు తెలీదనుకుంటాను" అంది.

"ప్రయత్నించండి" అన్నాను.

ఈసారి ఆమె చివరి ఆయుధం — నీళ్ళబాంబు— ప్రయోగించాక త్వరలోనే నేను దోషిగానూ, ఆమె ఫిర్యాదిగానూ అయిపోయేక మరొక పదిహేను నిమిషాల్లో డైమండ్ హార్బరు వేపు గంటకి ముప్ఫై మైళ్ళ వేగంతో సాగుతున్నాము. జ్యోతి డ్రైవ్‌చేసేటప్పుడు మాట్లాడ్డం ఇష్టం ఉండదు నాకు — ఎవరి ప్రాణం వారికి తీపి. దారిలో అట్టే సంభాషణ సాగలేదు.

తారి హోటల్లో కాఫీ తాగి, నాలుగు గంటలదాకా అటూ ఇటూ తిరిగి మళ్ళీ బయలుదేరబోయే ప్రయత్నంలో జ్యోతి కారు స్టార్టు చేసింది. ప్రయత్నం చేసింది. కాని, ఫలితం లేదు.

ఇరవైసార్లు ఇరవై విధాల ప్రయత్నించినా, ఏమీ లాభం లేకపోయింది.

"ఏమిటిది? వచ్చేటప్పుడు బాగానే ఉంది!" అంది ఆశ్చర్యంగా.

"నాకా మెకానిజం తెలీదు" అన్నాను.

"పుష్‌చేస్తే . . ."

వింటున్నాను.

"దయచేసి ఏదో ఒకటి ఆలోచించండి!"

తప్పక కిందకి దిగి, ఎవరైనా కనిపిస్తారని ఆశతో వెదికాను. సెలవురోజు, సముద్రం అట్టే లేదు.

"ఎవరూ లేరు!" అన్నాను.

"మరి, ఏం చెయ్యడం?"

"గరాజికి ఫోన్‌చేస్తే—"

"సెలవు ఇవేళ."

అటునించి వర్షం ముసుకుని వస్తూంది. ఆ మాట జ్యోతికి చెప్పేను. ఆమె సంతోషించలేదు.

"కనీసం హోటల్‌దాకానైనా పోతే . . ."

ఇద్దరు కుర్రవాళ్ళు దేవుడి రెండు రూపాల్లాగ వచ్చి, "సహాయం కావాలా?" అని అడిగారు.

వాళ్ళ ధర్మమా అని కారు హోటల్ దాకా తోయించి వాళ్ళకి రెండు బదులు మూడు రూపాయలిచ్చి, "ఇక్కడ మెకానిక్ ఎవరైనా ఉన్నారా?" అని అడిగేను.

లేరు — ఉన్న ఇద్దరూ సినిమాకని కలకత్తా వెళ్ళేరు.

మళ్ళీ హోటల్లోకి వెళ్ళేం.


వర్షం జోరుగా కురవడం ప్రారంభించింది.

ఈ సమస్య ఎలాగ పరిష్కరించాలో నాకు బోధపడలేదు. హోటల్లో ఎక్కడా ఖాళీ లేదు కూర్చుందుకి. అన్నిచోట్లా మనుషులు— కలకత్తా అంతా ఇక్కడికే వచ్చినట్టు.

"తలనొప్పిగా ఉంది" అంది జ్యోతి.

అలసిపోయింది — కాని ఏం చెయ్యడం? కనీసం ఆమె కూర్చునేందుకైనా ఏర్పాటు చెయ్యలేకపోవడం చాలా విచారం కలిగించింది.

"సారీ — ఏం చెయ్యడం?"

నోవా టాల్కమ్ పౌడరు


ఇది మీ శరీరమునుంచి చెడువాసనను, చెమటను తొలగించును. ఇది పసి పాపల మృదువైన శరీరమునకు శ్రేష్ఠమైన టాల్కమ్ పౌడరు. మీ చెమటను దూర పరచాలంటే దీనిని వాడండి. ఈ రోజు మంచే వాడండి. మీకు ఎంత చక్కగా ఉపయోగపడగలదో చూడండి.
ఉత్పత్తిదారులు :
నోవా కంపెనీ, ఆగ్రా రోడ్డు, భండుప్, బొంబాయి - 78

"మీదని రూమ్ ఉంటే కనీసం రెస్ట్ తీసుకుంటాను" అంది జ్యోతి. జాలివేసింది నాకు.

మేనేజర్ని అడిగాను.

"సారీ — నో రూమ్. అన్నీ ఫుల్."

సారీ . . . ఇంతకన్న నిరాశ అనుభవించిన క్షణాలు నా జీవితంలో అప్పటికి లేవు. జ్యోతి దూరం నించి పరిస్థితి అర్థంచేసుకున్నట్టుంది — ఆమె మరి కొంచెం నీరసంగా ముఖం పెట్టింది.

"హలో! — రావ్‌సాహెబ్!"

భుజంమీద చెయ్యి — పరిచితమైన కంఠం. 'భగవాన్!' అనుకున్నాను. "ధన్యవాదాలు." అతను రమేశ్వర్.

"ఇక్కడ ఏం చేస్తున్నారు?"

చెప్పేను క్లుప్తంగా.

"నా గదికి రండి."

జ్యోతిని పిలిచేను. ముగ్గురం మీదికి వెళ్లేం. అతను తలుపు తట్టి ఒక గదిలోకి మమ్మల్ని తీసుకెళ్లి, "ఈమె — ప్రియంవద. ఈయన రావ్, ఈవిడ—"

"జ్యోతి" అన్నాను.

పరస్పర నమస్కారాలయేక జ్యోతి ప్రియంవదతో మంచంమీద కూర్చుంది.

"అలాగ ఉన్నారేం?" అని ఆత్రతతో అడిగింది ప్రియంవద.

"తల నొప్పిగా ఉంది."

"నాదగ్గర సారిడన్ ఉంది — పదండి. ఆ పక్క నా గదిలో కొంచెంసేపు నిద్రపోదురు గాని" అని జ్యోతిని తీసుకుని ఆమె వెళ్లిపోయింది.

రెండు విషయాలు నాకు ఆశ్చర్యం కలిగించేయి. ప్రియంవద సౌందర్యవతి కాకపోవడమే కాదు — దగ్గిర దగ్గిరగా ఆమె అందవికారంగా ఉంది. రమేశ్వర్ ఎంతో స్ఫురద్రూపి — పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. అతనికీ ఈమెకీ ఎలాగ జంట కుదిరింది?

ఆమె "నా" గది అని వేరుగా రూమ్ ఎందుకు ఉంచుకుంది?

"కాఫీ తాగుదామా?" అన్నాడు రమేశ్వర్.

"ఆఁ . . ."

అతను కిందికి టెలిఫోన్ చేసి, నాలుగు కాఫీలు ఆర్డర్‌చేసి, నాకు సిగరెట్ ఇచ్చి, "కారులో ఏమిటి పాడైంది?" అన్నాడు.

"తెలీదు — స్టార్ట్ కాలేదు" అన్నాను.

"వర్షం కొంచెం తగ్గగానే చూద్దాం" అన్నాడు ఆయన.

"మీకు మెకానిజం కూడా తెలుసా?" అన్నాను ఆశ్చర్యంగా.

నవ్వి, "నా వృత్తే అది — నేను ఇంజనీర్ని" అన్నాడు రమేశ్వర్.

కాఫీ వచ్చింది. రెండు కప్పులు అవతలి గదికి పంపించేక, "మీ రీ రాత్రి వెళ్లేలాగ లేదు. . . వర్షం మరీ ఎక్కువగా పడుతూంది. రోడ్లు ప్రమాదంగా ఉంటుంది" అన్నాడు.

"కాని — రాత్రి వెళ్లి తీరాలి" అన్నాను.

"ఏం?"

"జ్యోతి — ఇంటికి చేరాలి కదా!"

"ఓ!" అని అతను ఆలోచించి, "మా హెరాల్డులో వెళ్లకండి. నా డ్రైవరుది ఇక్కడే ఇల్లు. అతను డ్రాప్ చేస్తాడు" అన్నాడు.

"అక్కర్లేదండి — కారు బాగయితే. . ."

"చూద్దాం . . ."

ప్రియంవద లోపలికి వస్తూ, "అమ్మాయి బాగా అలిసిపోయింది. నిద్రపోతూంది. గంటసేపు పడుకుంటే . . ."

"రాత్రి ఇంటికి వెళ్లాలిట వారు" అన్నాడు రమేశ్వర్, ఫిర్యాదు చేస్తూన్నట్టు.

"శ్రమపడతారు — ప్రమాదం కూడా" అంది ప్రియంవద.

"అదే చెప్పేను — ఆయన వినడంలేదు. నువ్వు అమ్మాయితో మాట్లాడు" అన్నాడు రమేశ్వర్.

కొంచెంసేపే పలాగే ముగ్గురం కూర్చున్నాం. జ్యోతికి అలవాటుపడ్డ కళ్లకి ప్రియంవద మరీ కురూపిగా కనిపిస్తూంది. కాని, నాకు నేనే బుద్ధిచెప్పుకుని, ఆ కష్ట సమయంలో ఇంత సహాయం చేస్తూన్న స్నేహితుడికి నాలో నేను ధన్యవాదాలు చెప్పుకున్నాను. అతని ఉన్నతికి ఈమె సహకారం ఇంకా గొప్పతనం తెస్తూన్న సంగతి గుర్తింపు చేసుకున్నాను. ఉండిఉండి వాళ్లిద్దరి మధ్య కలుసుకుంటూన్న కళ్లలో ఆమె మీద అతని కెంత అభిమానం, ఆప్యాయత ఉన్నాయో వ్యక్తం చేస్తున్నాయి. బాహ్యసౌందర్యంకన్న ఆత్మసౌందర్యం ఉన్నతమనే నిజాన్ని కార్యరూపంలో చూపిన ఈ ఉదారుడు నాకు మేరువులాగ కనిపించాడు.

ప్రియంవద వెళ్లిపోయాక రమేశ్వర్ హోటల్‌లో ఒక నౌకర్ని పిలిచి ఒక గంటలో రమ్మని తన డ్రైవర్‌కి కబురు చేశాడు, నా మాట వినిపించుకోకుండా.

జ్యోతి మరో అర గంటలో లేచి వచ్చింది. విశ్రాంతి వల్లకాబోలు, ఎంతో తేలికపడినట్టు కనిపించింది. ఇంటికి ఫోన్ చేసి, ఎలాగ ఆలస్యం అయిందో చెప్పి, తల్లితో పదిహేను నిమిషాలు మాట్లాడింది.

మేం బయలుదేరేసరికి వర్షం పడుతూనే ఉంది. రమేశ్వర్‌ది పెద్ద ఫోర్డుకారు. రోడ్డుమీద నీటికి భయపడకుండా సాగిపోయింది.

దారిలో జ్యోతి, "ఎంత మంచివాడు మీ మిత్రుడు! ఆమె అలాగే, ఎంతో ఆప్యాయంగా చూసింది నన్ను. . . దంపతులంటే అలాగ ఉండాలి!" అంది.

"అవును. అన్ని సౌందర్యాలకన్నా ఆత్మసౌందర్యం గొప్పది" అన్నాను నా ఆలోచనలో నేనుండి.

ఆ తరవాత జ్యోతి నాతో మాట్లాడలేదు. ఆలోచించాకగాని, అదెందుకో అర్థంకాలేదు నాకు. ఆమెని ఇంటిదగ్గిర దింపికూడా మీదికి వెళ్లబోతే, "థాంక్స్! మీకు శ్రమ వద్దు. . ." అని ఎర్రటి కళ్లతో అని, విసురుగా వెళ్లిపోయాకగాని, నేను ఆ కారణం గురించి ఆలోచించలేదు.

అర్థం అయాక ఆమెని నొప్పించినందుకు బాధపడ్డాను. కాని, చేసేదేమీలేక, బరువుగా ఇంటికి చేరుకున్నాను ఆ వర్షంలోనే. టైమెంతో అవలేదు. ఎనిమిది కావస్తూంది.

ఆ ఊళ్లో ఉన్న ఒంటరితనం అంతా నా గదిలోనే ఉంది ఆ రాత్రి.

ఆ తరవాత మూడు వారాలకిగాని రమేశ్వర్‌ని మళ్లీ కలవడం తటస్థపడలేదు. అతని అడ్రసూ,



'అయ్యవారికి చాలు అయిదు వరహాలు'

చిత్రం—మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు—2)

టెలిఫోన్‌నంబరూ తీసుకోవడం మరిచిపోయినందుకు ముందర చాలా విచారించాను. కాని, తరవాత సి. ఐ. టి. రోడ్‌లో ఉన్న రమేశ్వర్ అతనొక్కడే కావడాన్ని అతని టెలిఫోన్‌నంబరు తీసుకున్నాను. కాని, టెలిఫోన్ చెయ్యడం అప్పటిదాకా కుదరలేదు.

ఈ మూడు వారాలలోనూ జ్యోతి చాలా తప్పించుకుని తిరిగింది. తప్పు నాది కావడంవల్ల ఆమెని ప్రసన్నంగా చేసుకునే ప్రయత్నం చెయ్యక తప్పలేదు. అదీకాక, ఆమె అంత దూరంగా ఉండిపోవడం పెద్ద లోటుగా కనిపించి, చాలా బాధ పెట్టింది.

ఆ రోజు రవీంద్ర సదన్‌లో భరతనాట్యం ఉంది. నాతో రావడానికి అంగీకరించింది చాలా వాదించాక, జ్యోతి. ఆమెతో నేను థియేటర్ చేరేసరికి ప్రోగ్రామ్ ప్రారంభించే ప్రయత్నంలో ఆడిటోరియమ్‌లో దీపాలు ఆర్పేశారు. ముందర వరసలో మా సీట్లకి చేరుకుని, ఎంతో అద్భుతంగా ఉన్న నాట్యప్రదర్శన చూస్తూ నేనూ, జ్యోతీ అన్నీ మరిచిపోయాము.

దీపాలు వెలిగాక మే మిద్దరం బయటికి వచ్చాం. కోక్‌షాప్ దగ్గిర ఒక యువతి సౌందర్యంతో వెలిగిపోతూ కనిపించింది. కొద్ది క్షణాలు నేనూ, జ్యోతీకూడా కళ్లు తిప్పుకోలేకపోయాం. ఇంతట్లో ఆమెకి కోక్ తెచ్చి ఇస్తూ, కనిపించాడు రమేశ్వర్.

జ్యోతి ఆలోచన ఆ క్షణంలో ఏమిటో తెలీదు గాని, నా ఆలోచనలు షాక్‌తిన్న మాట నిజం. రమేశ్వర్ అటు తిరిగి ఆమెతో ఏదో అని, ఆమెని నవ్విస్తున్నాడు. ఖాళీసీసా ఆమె చేతిలోనుంచి ఎంతో చనువుతో తీసుకుని దుకాణంలో ఇచ్చేసి, భుజంమీద చెయ్యివేసి లోపలికి తీసుకెళ్లాడు. ఆమె కనీసం అతన్ని వారించనైనాలేదు. పైగా అతని చెయ్యి తన చేతిలోకి తీసుకుంది. అతని కళ్లల్లోకి ఆమె చూసిన తీరుగాని, అతని కళ్లల్లో వెలుగుగాని వాళ్లిద్దరి మధ్య ఉన్న అనురాగపు లోతుల్ని దాచలేదు.

అతను నన్ను చూడనందుకు చాలా సంతోషించాను. నేరం చేస్తున్నది అతనే అయినా, దానికి సాక్షిగా ఉండి, ఆ విషయం అతనికి తెలియడం మరీ కష్టం నాకు.

సగం తాగిన కోక్సు వదిలేసి, నేనూ జ్యోతీ లోపలికి వెళ్ళేం—ఎటూ చూడకుండా. ఆ క్షణాల్లో మెరుపులాటి అతని ఊహాచిత్రం నా మనసులో గడ్డిపోచలాగ అయిపోయింది. ప్రియంవద అంటే ఎంతో జాలివేసింది.

ప్రోగ్రామ్ అయిపోయాక అటూ ఇటూ తిరిగి, పార్క్ స్ట్రీట్‌లో ఆగి హ్యాలిటీకి వెళ్ళేం. భోజనం ఇద్దరికీ నయించదు. స్నాక్సూ, కాఫీ ఆర్డరు చేశాను.

"ప్రోగ్రామ్ అద్భుతంగా ఉంది" అన్నాను మా ఇద్దరి మధ్యా వచ్చిన ఈ కొత్త ఆలోచనలని దూరం చేసే ప్రయత్నంలో.

"అవును" అంది జ్యోతి.

"అన్నిటికన్నా ఏ ఐటమ్ బాగుంది?" అన్నాను, నా కన్నా లోతుగా ఈ పరిస్థితుల్లో కూరుకుపోయిన ఈ అమ్మాయిని బయటికి తెచ్చేందుకు.

జ్యోతి జవాబివ్వకుండానే, టేబిల్‌మీద కత్తితో గీతలు గీస్తోంది.

చివరికి "ఆ రోజు—డైమండ్ హార్బర్‌లో—జ్ఞాపకం ఉందా?" అంది.

"ఆఁ" అన్నాను జాగ్రత్తగా.

"ప్రియంవద ఆమెకి అతనంటే ఎంత అభిమానమో! అతన్ని గురించి నే నడిగినప్పుడు ఏం చెప్పిందో తెలుసా?"

"ఏమడిగావు నువ్వు?"

"వాళ్ళ వివాహం అయి ఎన్నాళ్ళయిందని. . ."

". . . . . . . . . ."

"ఆవిడ ఎంతో స్వచ్ఛంగా నవ్వి, 'నాకు తెలిసినప్పటి నించి, అమ్మాయీ. . . కిందటి జన్మలో, ఆ కిందటి జన్మలోనూ' అంది. ఆమె స్మృతితో ఆమెలో కవిత్వం పుట్టించింది."

"పూర్ గర్ల్. . ."

"అవును. మగవాళ్ళను ఎప్పుడూ నమ్మకూడదు" అంది బాధగా, కోపంగా, నిజాయితీతో జ్యోతి.

"ఇలాటి తప్పులు మగవాళ్ళు ఒక్కరూ చెయ్యరు" అన్నాను.

"మోసం వాళ్ళే చేస్తారు" అంది, ఆ విషయం మీద చర్చ అక్కర్లేనట్టు జ్యోతి.

"ఇలాటి మనిషని అనుకోలేదు" అన్నాను తినడం ముగించి, కాఫీ తాగుతూ.

"మీ స్నేహితులలాగే. . . మీరూ అలాగే అవుతారు చివరికి" అంది జ్యోతి.

ఎంతో ఉత్తముడని అనుకున్న మనిషిలో నీచత్వం బయట పడటం చక్కటి ఒక కల కరిగిపోవడంలాంటిది. ఒక్కరైతే ఇలాటి అనుభవాలని అంతరాంతరాల్లో దాచుకుని రహస్యంగా బాధపడుతూ భరించగలరు.

ఇద్దరి మధ్య ఇలాంటి కలలు కరిగి, ఎన్నోరెట్లు బాధ కలగజేస్తాయి — ముఖ్యంగా కలలు కనే కాలంలో ఉన్న మా ఇద్దరిలాటి ఇద్దరికి.

కాని, నా స్నేహితులందరినీ ఒక్క మాటతో అగౌరవం చెయ్యడాన్ని అంగీకరించలేకపోయాను.

"నా స్నేహితులెవరో మీకు తెలియదు" అన్నాను.

సీరియస్‌గా నవ్వి, "ఒకరు తెలుసును కదా!" అంది జ్యోతి.

"ఆ స్నేహం గంటన్నర కిందట సమాప్తం అయింది" అన్నాను.

"తొందరపడి, నిలుపుకోలేని మాట అనకండి."

"మీకే తెలుస్తుంది — నాకూ కొన్ని ప్రిన్సిపుల్సు ఉన్నాయి."

బిల్ చెల్లించి బయటికి వచ్చాం. పార్క్ స్ట్రీట్ యథాప్రకారంగా ధనవంతులతో, వారి అవసరాలతో, దీపాలతో మెరిసిపోతూంది.

నన్ను డ్రాప్‌చేసి వెడతానంది జ్యోతి. నే నంగీకరించకపోయినా, బలవంతంచేసింది. దారిలో, "ప్రియంవద — ఆమెని తలుచుకుంటే బాధగా ఉంది" అంది జ్యోతి.

"కాని . . . వాళ్ళిద్దరిమధ్యా ఎంతో అనురాగం ఉందనిపించింది. ఆ రోజు —"

"నటన — అతనిది. అజ్ఞానం — ఆమెది" అంది జ్యోతి. నన్ను వదిలి వెళ్ళిపోయింది.

ఆ తరవాత కొద్ది రోజులకి ఒక సాయంత్రం హఠాత్తుగా రమేశ్వర్ నా ఇంటికి వచ్చాడు. చాలా ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాను.

> **మంచి పుస్తకం**
>
> మంచి పుస్తకం నేస్తాలందరిలోకి గొప్ప నేస్తం. ఎప్పటికయినా ఇదే యథార్థం.
>
> —టప్పర్

ఎంతో చక్కగా నవ్వుతూ, "సర్ప్రైజ్! — అనుకోకుండా ఈ ప్రాంతానికి వచ్చేను. మిమ్మల్ని కలుసుకోకుండా వెళ్ళిపోలేక పోయాను" అని చనువుగా కూర్చున్నాడు.

కొద్దిక్షణాలు అతనంటే నాలో నేను సృజించుకుని పెంచుకున్న విద్వేషం, అతని ఆప్యాయత, చనువు, నాకు అతను చూపిన సౌహార్దం కలిగిస్తున్న స్నేహభావం మిళితమై నా ప్రవర్తనని తారుమారు చేశాయి. కాని, త్వరలోనే నాగరికతా, అయస్కాంతంలాంటి అతని వ్యక్తిత్వం కలిసి నన్ను జయించాయి. ప్రయత్నంతో ప్రారంభించి, చివరికి మనసారా అతనికి స్వాగతం చెప్పేను.

అవీ ఇవీ పదినిమిషాలు మాట్లాడేక, "మా గర్ల్‌ఫ్రెండ్ ఎలాగ ఉన్నారు?" అన్నాడు రమేశ్వర్.

"ప్రియంవదగారిని చూడాలంటూంది" అన్నాను.

"తప్పకుండా . . . వచ్చే శనివారం శాంతినికేతన్‌కి పోదామనుకుంటున్నాం. మీరూ రాకూడదూ?" అన్నాడు.

"ఆమెను అడుగుతాను."

"ఒప్పించండి.—"

"అంత సుళువుకాదు. . ."

"సుళువు చేసుకోవాలి — మనుష్యులం. . ."

చిరునవ్వుతో మాట ఆపేశాడు రమేశ్వర్.

"ముందు ముందు దేవిగారేదు — ఆవిడ వెల్ టాక్స్ కట్టేవారి అమ్మాయి — "

"కాని, మీరంటే చాలా అభిమానం ఉంది."

నేనూ నవ్వేను — ఆ మాటలో నాకేం నమ్మిక లేదని సూచిస్తూ.

"ఎమైతేనేం, నా శుభాకాంక్షలు . . . టైమయింది. వెళ్ళాలి. టెలిఫోన్ చేస్తారా?" అంటూ తన కార్డు ఇచ్చి, లేచి నా ఇంటినీ, ఆతిథ్యాన్నీ, జ్యోతినీ మరోకసారి మెచ్చుకుని అతను వెళ్ళిపోయాడు. అతను వదిలివేసిన ఒంటరితనాన్ని అర్థంచేసుకునేలోగా, జ్యోతి వచ్చింది.

"ఏమిటా ఉద్వేగం?" అన్నాను ఆమెని చూసి, ఆశ్చర్యంగా.

"మీ ఫ్రెండు — అయిదు నిముషాలు నిలబెట్టి మాట్లాడేడు —"

"ఎక్కడ?"

"లిఫ్టు దగ్గర—'

"ఏమన్నాడు?"

"అంతా మీ గురించే — ఎంత ఉత్తములో, ఎంత సాధువులో — గాడ్! ఒళ్ళు మండిపోయింది."

"వదలి వచ్చిలేకపోయారా?"

"మేనర్స్ నాకైనా ఉండాలిగా?"

అయిదు నిమిషాలు ఇద్దరం మాట్లాడుకోలేదు. ఆమె ఎందుకు వదిలి రాలేకపోయిందో నాకూ తెలుసును. కొంచెం జాలీ, చాలా ఈర్ష్య కలిగాయి నాలో.

చివరికి, బాధిస్తున్న ఆలోచనలనించి తేరుకుని, "కాఫీ తాగుతారా?" అన్నాను.

"థాంక్స్ — కాని, మీరు వెళ్ళిపోకండి" అంది.

సర్వెంటుకి చెప్పి, నేను వచ్చి కూర్చుని, శాంతినికేతన్ మాట ప్రస్తావించేను.

"నాకూ చెప్పేడు —"

"ఏమన్నారు?"

"ఆలోచిస్తానన్నాను."

"మరి?"

"అంత అజ్ఞానమా మీది? పీక తెగినా, అతనితో వెడతానని ఎలాగ అనుకున్నారు?"

"అతనితోకాదు — నాతో."

"అదీ...అదే,..అసంభవం."

ఆమె కంఠస్వరంలోకి వచ్చిన కాఠిన్యం నాలో ప్రమాదకరమైన అనుమానాల్ని రేకెత్తిస్తోంది. కాని, జ్యోతి నాది కాదు. ఆమె మీద నాకు హక్కులేమీ లేవు.

"లేక్సువాకా పోయి వద్దామా?" అన్నాను, ఈ ఆలోచనల పరిసరాలనుంచి తప్పించుకునేందుకు.

"వద్దు — నన్నిక్కడే ఉండనివ్వండి" అంది జ్యోతి ఎంతో బాధపడుతూన్నట్టు.

క్రమంగా నిరుపయోగం అయినా, ప్రమాదంలేని విషయాలమీదికి సంభాషణ మళ్ళించి చాలాసేపు గడిపేను. ఆమె అగాధం అంచున నిలబడి ఉంది. ఆ జారుడు మీదనించి ఆమెని తొయ్యడం నాకు భయంకరంగా కనిపించింది. స్నేహంలో జ్యోతి నాకు చిన్నదైనా ఆ హక్కు, బాధ్యత నాకు ఉన్నాయి.

ఎలాగో వారం తరవాత జ్యోతి విచిత్రమైన ఉత్తరం రాసి నేను లేనప్పుడు నా ఫ్లాట్‌లో పడేసి వెళ్ళింది. నాలుగు పేజీల ఉత్తరంలో ఆమె మానసికంగా పొందిన విభ్రమం ఎంతో కనిపించింది.

"అతనితో మీరు స్నేహం మానలేరు.

అందుకే మిమ్మల్ని కలుసుకోవాలని లేదు — ఈ ప్రయత్నంలో సహాయం చెయ్యండి. గుడ్‌బై . . ." అంటూ ముగిసింది ఉత్తరం.

గుడ్‌బై! అన్నాను — నాకు నేనే.

ఆమె నా జీవితం నించి నిష్క్రమిస్తుందని ఎప్పుడూ తెలుసును నాకు. ఇలాగ, ఇప్పుడు అనే అనుకో లేదు. ఆమె నా మూలంగా ఇరుక్కున్న పరిస్థితులకు నాకు జాలివేసింది. వ్యామోహం తీర్చుకునే శక్తిగాని, దాన్ని జయించే శక్తిగాని ఏదీ లేని వాళ్ళు వ్యామోహంలో పడితే, అది జాలిపడవలసిన పరిస్థితి.

చిత్రంగా జ్యోతి నా నించి తప్పుకోవడం రమేశ్వర్‌ని నాకేం దగ్గరచెయ్యలేదు. నాలుగైదు రోజుల క్రితం శాంతినికేతన్ రాలేమని చెప్పేందుకు అతనికి ఫోన్ చేసినప్పుడు త్వరలో మళ్ళీ కలుసుకుందాం అని నేను మనఃస్ఫూర్తిగానే చెప్పేను. జ్యోతి ఉత్తరం తరవాత రమేశ్వర్‌కి ఎంత దూరంగా ఉంటే అంత శాంతిగా కనిపించింది. కాని, ఏదో రోజు మలయానిలమల్లే అతను నా ఇంటి తలుపులు తీసుకుని వచ్చి నా విశ్వాసాన్ని భగ్నం చేస్తాడని మాత్రమే ఒక చిన్న భయం.

అలాటి దేమీ జరగలేదు ఒక నెలదాకా.

ఆ రోజు జ్యోతి టెలిఫోన్‌చేసి, "ఒకసారి రండి— మీతో మాట్లాడాలని ఉంది" అంది.

"మీ ఉత్తరం పదిలంగా ఉంది నా దగ్గిర" అన్నాను.

"ఆ ఉత్తరం మాట మరిచిపొండి — నా కిచ్చేయండి. ఎప్పుడు వస్తారు?" అంది జ్యోతి.

"ఆలోచించుకోనివ్వండి. మీ కపకారం కలిగించేదేదీ చెయ్యాలని లేదు" అన్నాను.

"మీకు ఎవరినీ క్షమించడం రాదని నా కనిపిస్తుంది — కాని, మిమ్మల్ని మీరూ క్షమించుకోలేరా?" అంది జ్యోతి.

"నేను చేసిన పొరపాటు ఏమిటో తెలిశాక అలాగే చేస్తాను. కాని నాకింకా అది తెలియలేదు" అన్నాను.

"భగవాన్! భగవాన్! మిమ్మల్ని కట్టుకునే అమ్మాయి జీవితాంతం బాధపడుతుంది" అంది జ్యోతి, ఓడిపోయినట్టు.

"మీరు ఎప్పుడూ సుఖంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తాను" అంటూ ఫోన్ పెట్టేశాను — కొన్ని విజాలకి మరీ దగ్గిరగా పోలేం, ఏమయినాసరే.

అంతరాంతరాలలో జ్యోతి మీద ఉన్న నా అనురాగం ఆమెకి నన్ను దూరంగా ఉంచుతూన్న ప్రయత్నంలో ఇలాటి దయాహీనమైన పనులు నా చేత చేయిస్తూంది. ఆమె శ్రేయస్సు నాకు ముఖ్యం. ఆమెలో చెలరేగుతూన్న దవానలాన్ని జయించే ప్రయత్నం ఆమే చెయ్యాలి. అది ముగిసేదాకా ఆమెని చూసే ఉద్దేశం లేదు నాకు. ఆ ప్రయత్నంలో నేను సహాయం చెయ్యడం ఆమె జీవితానికి మంచిది కాదు — బాకీలమీద నిలిచిన జీవితంలో అనురాగానికన్న విద్వేషానికి ఎక్కువ తావు ఉంది.

ఈ విషయం గుర్తించి మనసు రాయిచేసుకున్నా, ఉండి ఉండి వెయ్యి భయాలు నా జీవితాన్ని భయంకరంగా మార్చేశాయి. రమేశ్వర్ జ్యోతికి దూరంగా ఉన్నాడని నమ్మిక ఏమిటి? జ్యోతి తన ప్రయత్నంలో జయిస్తుందని నిర్ధారణ ఏమిటి? నేను దూరంగా ఉండాలా? ఆమెకి దగ్గిరగా ఉండి, సహాయంచెయ్యాలా? ఈ పరిస్థితుల్లో మళ్ళీ కలగజేసుకుంటే జ్యోతి నన్ను గౌరవిస్తుందా?



నీటికి

చిత్రం—జి వి. శివన్నారాయణ (టి గంగవరం)

రమేశ్వర్ అంటే విద్వేషం మళ్ళీ ఎక్కువ కావచ్చింది. అతను ప్రియంవదని డబ్బుకోసం పెళ్ళి చేసుకుని, ఈ సౌందర్యవతితో తిరుగుతున్నాడు. అతనికి జ్యోతిమీదకూడా దురాశ ఉండే ఉంటుంది. ఇలాటి నీచులకి తప్పుచేయటంలో హద్దులంటూ ఉండవు.

పాపం, ప్రియంవద! ఆమె కనిపిస్తే బాగుండును. అతని ఇంటికి వెళ్ళేది ఎలాగా అసంభవంకాని, ఆమెకి ఏమని చెబుతాను?

రెండు నెల లిలాగే జీవన్మృతుడి పీడకలలలాగ గడిచాయి. ఆ రోజుల్లో జ్యోతి నాలుగైదుసార్లు టెలిఫోన్ చేసింది. కాని, ఆమెకి అందకుండానే తప్పించుకున్నాను.

ఆ తరవాత ఒక రోజు ఆఫీసు పనిమీద డమ్‌డమ్ వెళ్ళి టాక్సీలో తిరిగి వస్తూంటే టాక్సీ సి. ఐ. టి. రోడ్‌లో ఒక సైకిల్‌ని గుద్ది, ఒకణ్ణి గాయపరిచింది. నిమిషాల్లో జనం టాక్సీని చుట్టుముట్టి డ్రైవర్‌ని తన్నడం మొదలుపెట్టేరు. గాయపడిన వాణ్ణి ఒకరో, ఇద్దరో నిలబెట్టి ఒక రికాలో ఎక్కించేరు. ఈ గందరగోళం మధ్య తప్పుకుని, నడవసాగాను. కల్పించుకుంటే నేనూ గాయపడడం తప్ప చేసేదేమీలేదు.

ఈమధ్య ఒంట్లో బాగుండడం లేదు. ఎండ విపరీతంగా ఉంది. దానికి తోడు ఆ సంఘటన మరీ బాధ కలగజేసింది. ముఖం తిరిగి మూర్ఛవచ్చేలాగ ఉంది నీరసం.

చుట్టూ వెతికేను కూర్చుందుకు నీడెక్కడైనా దొరుకుతుందని. కాని, అలాటి ప్రదేశం ఏదీ కనిపించ లేదు.

హఠాత్తుగా రమేశ్వర్ అడ్రసు జ్ఞాపకం వచ్చింది. పది అడుగుల్లో అతని ఇల్లు చేరుకున్నాను. నేను బెల్ మోగించేలోగా అతను వచ్చి తలుపు తీసి, నన్ను లోపలికి తీసుకువెళ్ళి నా పరిస్థితి అర్థం చేసుకుని నన్ను మంచం మీద పడుకోబెట్టేడు.

నాకు తెలివి వచ్చేసరికి డాక్టరు నా నాడి చూస్తున్నాడు.

"ఎగ్జాషన్, ఏమీ ప్రమాదంలేదు" అని డాక్టర్ అంటూంటే కళ్ళు తెరిచి, "సారీ — మిమ్మల్ని కంగారు పెట్టేశాను" అన్నాను క్షమాపణ చెబుతూ.

"కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి, కొన్ని మందులూ, విటమిన్ మాత్రలూ రాసి ఇచ్చి, డాక్టరు వెళ్ళిపోయాడు.

"నేనూ వెడతాను" అన్నాను లేస్తూ.

"అప్పుడే? ముందర టీ తాగండి" అని, రమేశ్వర్ గుమ్మంవైపు తిరిగి, "అమ్మాయీ, టీ తెచ్చి ఇయ్యి" అన్నాడు.

అతని కంఠస్వరంలోని ఆప్యాయత ఎంత కృత్రిమమో చూసిన క్షణమాత్రంలో అతనిమీద ద్వేషం రగులుకుంది. కాని, ప్రియంవదని మళ్ళీ కలుసుకునే అనుభూతిని ఎలాగ ఎదుర్కోవాలోననే ఆందోళనలో మిగిలిన వన్నీ మరిచిపోయాను.

మరొక నిమిషంలో టీ, బిస్కట్లూ, చీజ్, అన్నీ పట్టుకుని లోపలికి వచ్చింది ఆమె.

కళ్ళు బైర్లు కమ్మినట్లయింది నాకు. ఈవిడ ప్రియంవద కాదు — ఆ సాయంత్రం రవీంద్ర సదన్‌లో చూసిన సౌందర్యవతి!

"నా భార్య — రూప . . . ఈయన . . ."

ఆమె ఎంతో చక్కగా నవ్వి, "నాకు తెలుసును. ఈయనని మీరు తలుచుకోని రోజెప్పుడు?" అంది.

నాకేమీ వినిపించటం లేదు: కనిపించటంలేదు. అంతా అయోమయంగా ఉంది. ఏమిటి జరుగుతూంది?

"ఆయన చాలా నీరసంగా ఉన్నారు. ఏం స్నేహితులు మీరు? ఆ సంగతే మీకు తెలియదు!" అంది రూప, టీ కలిపి ఇస్తూ.

దోషి పట్టుబడిపోయినట్టు అతను నవ్వేడు. అవును, రూపా! అనుకుంటూనే ఈయనని చూడ్డానికి పోలేదు" అన్నాడు.

"మరి కొంతసేపు ఆయన్ని లేవనియ్యకండి— డాక్టర్ ముఖర్జీ చెప్పినట్లు చేయించండి. . . నేను వెళ్ళి గంటలో వస్తాను" అని భర్తతో చెప్పి, "క్షమించండి, ఒక స్నేహితురాలికి జబ్బుగా ఉంది. నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళి వస్తాను. మీరు నేను వచ్చేదాకా కదలకుండా పడుకోండి" అని ఎంతో అభిమానంగా చెప్పి, వెళ్ళిపోయింది రూప.

టీ నిశ్శబ్దంగా తాగుతున్నాము. ఈ విషయంలో నిజం చెప్పదలుచుకుంటే అది రమేశ్వర్ పూచీ.

నాకు సిగరెట్ ఇచ్చి, "ఎలాగ ఉంది?" అన్నాడు రమేశ్వర్, నా వైపు చూడకుండా.

"నీరసంగా ... అంతకన్నా, ఆశ్చర్యంగా" అన్నాను.

"అవును — ఆ విషయం అర్థంచేసుకోగలను" అన్నాడు అతను.

"నేనే అర్థంచేసుకోలేను" అన్నాను.

ఈ సారి రమేశ్వర్ నావైపు తిరిగాడు.

"సరి . . . మీకంతా ఎప్పుడో చెబుదామను కున్నాను. రూప — నా భార్య . . ."

"మరి — ప్రియంవద?"

"అదొక పెద్ద కథ. విచిత్రమైన పరిస్థితుల్లో నాకు తెలియకుండా ఆమె నా మీద మమత పెంచుకుంది. అప్పటికి నేనీ ఉద్యోగంలో జాయినయి, తల్లిదండ్రుల ఏర్పాటుతో రూపని పెళ్లిచేసుకొనే సన్నాహంలో ఉన్నాను."

"మరి—?"

"హఠాత్తుగా ప్రియంవద సంగతి తెలిసింది— ఆమె తన రహస్యాన్ని జాగ్రత్తగా దాచుకుంది. ఆమెతో ఎలాగ నేనామెని ప్రేమించని విషయం చెప్పాలో నాకు తెలియలేదు. ఆమె ఆరాధన — నాకోసం — నన్ను ఆశ్చర్య పరిచింది. వివరాలన్నీ ఎందుకు . . . విపరీతమైన మానసిక సంఘర్షణ తరవాత రూపని కాదని, ప్రియంవదని పెళ్లిచేసుకుందుకు నిర్ణయించుకున్నాను."

"మీ తల్లిదండ్రులు —"

"ఏమీ కాదనలేదు. రూపకి అంతా చెప్పేను. ఆమెకూడా అంగీకరించింది."

"కాని—?"

"ప్రియంవద అంగీకరించలేదు. తన అనురాగానికి నా బాధ్యత లేదంది. ప్రమాదకరమైన పని చేసే భయం నాకు కలిగజేసి, తనకి దూరంగా ఉంచింది. రూపని పెళ్లిచేసుకునితీరే పరిస్థితులు తెచ్చింది. పెళ్లి చేసుకున్నాను . . . రూప అంటే నాకు ప్రాణం."

"నా కింకా అర్థంకాలా."

"నెలకి నా రెండు రోజులు ప్రియంవదవి. ఆమె కోరిన దంతే . . . ఆమెకి అంతకన్నా దూరంగా ఉండలేను — నాకోసం సర్వత్యాగం చేసిన మనిషి ఆమె. ఇన్నాళ్లనించీ అలాగే . . ."

"రూపకి తెలుసా?"

బాధగా నవ్వేడు రమేశ్వర్. ఆ ప్రశ్న వేసినందుకు సిగ్గుపడ్డాను. కాని, నాకు జవాబు కావాలి.

"తెలుసు . . . పూర్తిగా. ఆ విషయం చర్చకి రాదు. అంతే."

అయిదారు నిమిషాలు ఇద్దరమూ మాట్లాడలేదు. అంతా అవగాహన అయాక నా కెంతో బలం వచ్చింది. లేచి, అతనితో కరచాలనంచేసి, వెళ్లేందుకు సిద్ధపడ్డాను.

"అప్పుడే? . . . మీ రిక్కడ ఉంటారని అనుకుంది రూప" అన్నాడు ఆశ్చర్యపోతూ రమేశ్వర్.

"తొందరగా వెళ్లాలి" అన్నాను.

"అంత తొందరేమి ఆఫీసు మూశాక ఏం ఉంటుంది? — రేపటికి ఆగని పని?" అన్నాడు ఆత్రతగా అతను.

"ఉంది" అన్నాను నిశ్చయంగా.

"ఏమిటది?" అన్నాడు రమేశ్వర్ ఆశ్చర్యంతో.

"జ్యోతి . . ." అన్నాను.

తెరతొలగి తీసినట్లు ఆమె సంపూర్ణంగా కనిపిస్తోంది నాకా నిమిషంలో. మా ఇద్దరి మధ్యా నిలబడ్డ ఈ మనుషులు, మమ్మల్ని ఇంతో దూరంగా ఉంచిన వీళ్లు, తొలగిపోయి మా మధ్య ఈ నెలలు పెంచిన దూరాన్ని ఒక్కసారి మాయంచేశారు.

"అవును . . ." అన్నా డతడు, కొంచెం సంశయిస్తూ.

లేచిపోయాను.

"ఫోన్‌చెయ్యండి" అన్నాడు బెడ్ పక్కన ఉన్న టేబిల్ మీది ఫోన్ చూపుతూ.

అనవసరం అనుకున్నాను. కాని, ఆమె నంబరు డయల్ చేశాను. ఆమె గొంతుక వినేదాకా ఆత్రత, తెలివి ఏదో ఆశ . . .

చివరికి ఆమె తియ్యటి కంఠం వినిపించింది. నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"ఎలాగ ఉన్నారు?" అన్నాను.

"బాగానే . . ."

"మీకు నాలుగైదుసార్లు టెలిఫోన్ చేశాను..."

"అవును—"

"ఎందుకు మీతో మాట్లాడలేదో మీకు తెలుసును."

"ఆఁ . . . నా ఉత్తరం . . ."

"అంతకన్నా పెద్ద కారణాలున్నాయి . . ."

"అలాగా?"

"ఆఁ . . . మీతో చెబుతాను . . ."

"మీ కనవసరమైన శ్రమ."

"కాదు— ఈ నిమిషంలో బయలుదేరుతున్నాను."

ఆమె కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయింది. నాకు తెలుసును — స్పందించే హృదయాలు హఠాత్పరిణామాలకి ఇంకా స్పందిస్తాయని . . . దుఃఖంలాగే ఆనందమూ అతిరిక్తమై, మాటలనీ చేతలనీ హరిస్తుందని.

చివరికామె మాట్లాడింది.

"మీకు తెలీదనుకుంటాను . . ."

"ఏమిటి?"

"సతీష్‌జీతో సెటిల్ చేసుకున్నాను. నాలుగు రోజుల కిందటే మా వివాహం అయిపోయింది."

సతీష్! అవును. ఆమెకి ఫ్రెండు. ఎప్పుడూ దూరంగా ఉంటూ, ఆమెని తప్పించుకుని తిరిగేవాడు!

"కంగ్రాట్యులేషన్స్!" అన్నాను మాట వచ్చాక.

"థేంక్స్!" అంది జ్యోతి.

"మీరు చాలా సుఖపడాలని కోరుతాను" అన్నాను.

"థేంక్స్" అంది జ్యోతి. సంభాషణ అంతం అయిపోయింది. నీరసంగా వెనక్కి జారబడ్డాను. ఆ క్షణంలో నన్ను పెనవేసుకున్న భావాలు నాకే తెలియలేదు. కొంచెం చల్లారేక ఒక్క సంతృప్తి చీకట్లో చిన్న జ్యోతిలాగ, అస్పష్టంగా తెలిసి వచ్చింది. . . రమేశ్వర్ గురించిన నిజం ఆమెకి తెలీదు — ఎన్నటికీ!

ఎప్పుడో బయటికి వెళ్లిన రమేశ్వర్ తిరిగివచ్చి, "అరె! చాలా నీరసంగా ఉన్నారు" అన్నాడు ఆత్రతతో.

"అవును" అన్నాను.

"మీరు ఎక్కడికీ వెళ్లద్దు—" అన్నాడు.

"అలాగే" అన్నాను.

వెళ్లేందుకు ఎక్కడా లేదని నేను చెప్పలేదు.

అతనికి అర్థం అయే ఉంటుంది. ★

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

ప్రకటన రేట్లు

కాజువల్: కాల. సెం. మీ 1 కి రు. 7–50
కంట్రాక్టు: కాలం సె . మీ. 1 కి రు. 6–80
(250 సెం. మీ. లు, ఆపైన)
ప్రకటనకు కనీస స్థలం
(సిం కాలం 5 సెం. మీ. లు)

అట్ట పేజీలు :

4 వ పేజీ - రెండు రంగులు
కాజువల్: ప్రకటన 1 కి రు. 1,100/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 950/—
(కనీసం 6 ప్రకటనలు)

2 వ పేజీ, 3 వ పేజీ -
ఒక రంగు
కాజువల్: ప్రకటన 1 కి రు. 700/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 600/—
(కనీసం 6 ప్రకటనలు

కొలతలు:
కాలం వెడల్పు 5 సెం. మీ.
కాలం నిడివి 23 సెం. మీ.
పేజీకి 3 కాలంలు

ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:

అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్,
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2

1–8–66 నుంచి ప్రకటనల్పైటిమీదను 10% సర్చార్జి విధించబడును.